



కరీంనగర్ తెరపైకి తీన్మార్ మల్లన్న





- బీసీకి టికెట్ ఇచ్చే యోచనలో కాంగ్రెస్
- సామాజిక సమీకరణాలతో మారుతున్న అంచనాలు
- 31న కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

కాంగ్రెస్‌లో కరీంనగర్ పార్లమెంట్ స్థానానికి అభ్యర్థి ఎవరన్న చిక్కుముడి వీడడం లేదు. ఆ పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ తొమ్మిది సార్లు సమావేశమై అభ్యర్థులను ఖరారు చేసినా కరీం నగర్ అభ్యర్థి విషయం తేలడం లేదు. ఈ కమిటీ సమావేశం ఈనెల 31న ఢిల్లీలో జరుగనుండగా పదో సారైనా అభ్యర్థి ప్రకటన వెలువడుతుందా అన్నది ప్రశ్నార్థకంగానే ఉన్నది. రాష్ట్రం నుంచి ఈ స్థానానికి మాజీ శాసనసభ్యుడు అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి పేరు మాత్ర మే పంపించగా ఢిల్లీ స్థాయిలో మూడుపేర్లు ప్రధానంగా పరిశీలనకు వచ్చాయి.

రెడ్డి.. వెలమ.. బీసీ..

రెడ్డి సామాజికవర్గానికి చెందిన ప్రవీణ్ రెడ్డి, వెలమ సామాజికవర్గానికి చెందిన వెలిచాల రాజేందర్‌రావు, బీసీ సామాజిక వర్గం నుంచి రుద్ర సంతోష్‌కుమార్ పేర్లు పరిశీలనకు వచ్చాయి. తొలుత రెడ్డి సామా జిక వర్గంవైపే మొగ్గు చూపిన కేంద్ర నాయ కత్వం రాష్ట్రంలో రెడ్డి అభ్యర్థులు ఎక్కువ అవుతున్నారన్న కారణంగా వెలిచాల రాజేందర్‌రావు పేరును పరిశీలించడం ప్రారంభించింది. మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు ఈ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మరో ముగ్గురు శాసన సభ్యులు, ముగ్గురు నియోజకవర్గ ఇన్‌చార్జిలు కూడా రాజేందర్ రావుకు మద్దతు ప్రకటించడంతో ఆయన పేరే తొమ్మిదవ జాబితాలో ప్రకటిస్తారని అందరూ ఆశించారు. ఈ వ్యవ హారం కులాల సమీకరణాల మధ్య మరింత చిక్కుపడి పోయి అధి ష్ఠానం నిర్ణయం తీసుకోకుండా తర్వాత సమావేశానికి వాయిదా వేసింది. రాష్ట్రంలో 17 పార్లమెంట్ స్థానాలు ఉండగా మూడు స్థానాలను ఎస్సీలకు, రెండు స్థానాలను ఎస్టీలకు రిజర్వు చేశారు. 12 జనరల్ స్థానాల్లో బీసీలు, అగ్రవర్ణాలకు చెందిన ఇతర కులాలకు ఈ స్థానాలను కేటాయించాల్సి ఉన్నది. ఇప్పటి వరకు 13 స్థానాలకు కాంగ్రెస్ అధిష్ఠానవర్గం అభ్యర్థులను ప్రకటిం చింది. అభ్యర్థులను ఖరారు చేయని స్థానాల్లో కరీంనగర్, ఖమ్మం, వరంగల్, హైదరాబాద్ మిగిలిపోయాయి. వరంగల్ ఎస్సీలకు రిజర్వు చేసిన స్థానం కాగా, మిగతా మూడు జనరల్ స్థానాలుగా ఉన్నాయి. ఇప్పటి వరకు ప్రకటించిన 13 మంది అభ్యర్థుల్లో ఇద్దరు ఎస్సీ, ఇద్దరు ఎస్టీ, ముగ్గురు బీసీ, ఆరుగురు రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారు ఉన్నారు.

కరీంనగర్‌ను మొదటి నుంచి రెడ్డికి కానీ వెలమకు కానీ ఇవ్వాల నే అభిప్రాయంతోనే సర్వేలు నిర్వ హిస్తూ వచ్చి ప్రవీణ్‌రెడ్డి, రాజేం దర్‌రావు పేర్లను పరిశీలించి తర్జన భర్జన పడుతూ ఖరారు చేయకుం డా ఉన్నారు. ఇప్పుడు ఈ రెండు సామాజిక వర్గాలకు కాకుండా బీసీలకు ఈ స్థానం కేటాయించే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్ పార్టీ బీసీలకు ఆరు స్థానాలను, బీజేపీ ఐదు స్థానాలను కేటాయించాయి. ఇప్పటి వరకు కాంగ్రెస్ మూడు స్థానాల్లో మాత్రమే బీసీలకు అవకాశం కల్పించింది. మిగిలిన మూడు స్థానాల్లో రెడ్డి, వెలమ, ఇతర కులాలకు చెం దిన వారిని ప్రకటిస్తే బీసీ వ్యతిరేక పార్టీ అని అనుకునే ప్రమాద ముందని, ఇతర పార్టీలు కూడా ఇదే ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకవెళ్తాయని కాంగ్రెస్ ఆలోచిస్తున్నట్లు తెలిసింది.

బీసీల ఓట్లు కీలకంగా ఉన్నందున మిగిలిన మూడు స్థానాల్లో ఒకటి లేక రెండు స్థానాలను వారికే ఇవ్వా లనే ఆలోచన కూడా చేస్తున్నట్లు తెలిసింది. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన రోజుల్లోనే బీసీలకు ఐదు సీట్లు కేటాయించాలనే డిమాండ్ వచ్చింది. పలువురు కాంగ్రెస్ సీనియర్ నేతలకు కూడా బహిరంగంగానే ఈ ప్రకటనకు మద్దతు పలికారు. ఇప్పుడు మూడు సీట్లతో సరి పెడితే బీసీలు దూరమయ్యే అవకాశ ముందని కాంగ్రెస్ నాయ కత్వం ఆందోళనకు గురవుతున్నట్లు తెలుస్తున్నది. ఖమ్మంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సతీమణి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సోద రుడు, కమ్మ సామాజిక వర్గానికి చెందిన మరోమంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కుమారుడు టికెట్ ఆశిస్తున్నారు. వీరిలో ఒకరికి టికెట్ ఇవ్వాల్సి ఉన్న నేపథ్యంలో బీసీల కోటాలో వారు రారు. మిగిలిన రెండు స్థానాలు కరీంనగర్, హైదరా బాద్‌లో బీసీలకు అవకాశం కల్పించడమే మిగిలిందని తెలుస్తున్నది.

స్థానికులకు అవకాశం ఇవ్వాలంటున్న రుద్ర సంతోష్‌కుమార్

కరీంనగర్ నుంచి టికెట్ ఆశిస్తున్న రుద్ర సంతోష్‌కుమార్ పేరు పరిశీలనలో ఉన్నా ఈ స్థానంలో భువనగిరి టికెట్ ఆశిం చిన తీన్మార్ మల్లన్న అభ్యర్థిత్వాన్ని ప్రకటిస్తే ఎలా ఉంటుందని అధిష్ఠానం ఆలోచిస్తున్నట్లు తెలిసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, ఈ ప్రతిపాద నను కేంద్ర కమిటీ ముందు ఉంచారని, ఈ కారణంగానే రాజేం దర్‌రావు పేరు ప్రకటన దశలో నిలిచిపోయిందని సమాచారం. రుద్ర సంతోష్‌కుమార్ స్థానికుడినైన తనకు కాకుండా స్థానికే తరులకు టికెట్ ఇవ్వడం సమంజసం కాదని, అలా చేస్తే పార్టీ ఎన్నికల్లో దెబ్బతినే అవకాశమున్నదని నాయకులతో అన్నట్లు తెలిసింది.

ఇప్పటికే బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్, బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను స్థానికేతరుడిగా అభి వర్ణిస్తూ ప్రచారం చేస్తున్నారు. పక్క జిల్లాకు చెందిన వినోద్ కుమార్ ఒకసారి కరీంనగర్ ఎంపీగా గెలిచిన నేపథ్యం ఉన్నా ఆయనను స్థానికేతరుడు అంటున్న దశలో కాంగ్రెస్ స్థానికేతర అభ్యర్థిని తీసుకొని వస్తే బీజేపీ లాభపడడం మినహా కాంగ్రెస్‌కు మిగిలేది ఏమి లేదనే వాదనను సంతోష్‌కుమార్ తెరపైకి తెస్తున్నారని తెలిసింది. కరీంనగర్ స్థానం తీన్మార్ మల్లన్నకు దక్కుతుందా... సంతోష్‌కుమార్ ప్రయత్నాలు ఫలిస్తాయా... బీసీ గండాన్ని దాటుకొని రాజేందర్‌రావు టికెట్ దక్కించుకుంటారా అనేది తేలాల్సి ఉంది.

తాగునీటి ఇబ్బందులు తొలగించాలి

కలెక్టర్ పమేలా సత్పతి



చేగుర్తిలో నర్సరీని పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ రూరల్, మార్చి 27: గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. గురువారం కరీంనగర్ రూరల్ మండలంలోని చేగుర్తిలో బోర్‌వెల్, నర్సరీ, గ్రామీణ క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడైనా తాగునీటి సమస్య ఉంటే యుద్ధ ప్రాతిపదికన పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.. గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు 31లోగా పూర్తి చేయాలన్నారు. నిర్మాణాలు పూర్తి కాకపోతే నిధులు ల్యాప్స్ అయ్యే ప్రమాదం ఉందన్నారు. గ్రామంలో ఎస్డీఎఫ్ నిధులతో వేసిన తాగునీటి బోర్‌వెల్, ట్యాంకును పరిశీలించారు. అనంతరం నర్సరీని పరిశీలించి మొక్కల పెంపకానికి తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంజీవరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సూర్యప్రకాశ్, మిషన్ భగీరథ గ్రిడ్ డీఈ ప్రభాకర్, ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, ఆర్ఐ వాస్తవిక్, పీఆర్ ఏఈ రమణారెడ్డి పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు



మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్, మార్చి 28: మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ్ పక్షోత్సవాలలో జిల్లా రాష్ట్రస్థాయిలో మొదటిస్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా పోషణ్ అభియాన్ కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు కలెక్టర్ పమేలా సత్పతి గురువారం ప్రశంసాపత్రాలను అందజేశారు. జిల్లా కో ఆర్డినేటర్ ఇ నాగరాజు, ప్రాజెక్టు అసిస్టెంట్ జి రొమీల, హుజూరాబాద్ సీడీపీవో తిరుపతమ్మ, సూపర్‌వైజర్ శిరీష, బ్లాక్ కో ఆర్డినేటర్ కె నాగరాజు, అంగన్‌వాడీ టీచర్ కరుణ ప్రశంసా పత్రాలను అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమాధికారి సరస్వతి మాట్లాడుతూ పోషణ్ పక్వాడ కార్యక్రమాల నిర్వహణలో జిల్లా మొదటిస్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. ఇందుకు కృషిచేసిన సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, డీపీఏలు, అంగన్‌వాడీ టీచర్లను ఆమె అభినందించారు.

'పది' పరీక్షలకు 40 మంది విద్యార్థుల గైర్హాజరు

కరీంనగర్ టౌన్, మార్చి 28: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా గురువారం నిర్వహించిన జీవశాస్త్రం పరీక్షకు 40 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈవో సీహెచ్‌వీఎస్ జనార్దన్‌రావు తెలిపారు. 12,565 మంది విద్యార్థులు రెగ్యులర్‌గా పరీక్షలు రాయాల్సి ఉండగా 14 మంది గైర్హాజరయ్యారని, 12,551 మంది పరీక్షలకు హాజరయ్యారని చెప్పారు. 92 మంది ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలకు హాజరు కావలసి ఉండగా 26 మంది గైర్హాజరయ్యారన్నారు. కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ పరీక్షా కేంద్రంలో ఒక విద్యార్థి కాపీయింగ్ చేస్తూ దొరకడంతో మాల్‌ప్రాక్టీస్ కింద బుక్ చేసి డీబార్ చేసినట్లు తెలిపారు.

టీఎన్జీవోస్ భవనానికి ఆస్తి పన్ను మినహాయింపు ఇవ్వాలి

కరీంనగర్ టౌన్, మార్చి 28: కరీంనగర్ టీఎన్జీవోస్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ సొసైటీ భవనానికి ఆస్తిపన్ను మినహాయింపు ఇవ్వాలని ఆ సంఘం డిమాండ్ చేసింది. గురువారం ఈమేరకు సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సంఘం ప్రతినిధులు మున్సిపల్ రెవెన్యూ అధికారి ఆంజనేయులును కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ కార్యదర్శి సంగం లక్ష్మన్‌రావు, అర్బన్ అధ్యక్షుడు సర్దార్ హర్మీందర్‌సింగ్, రూరల్ అధ్యక్షుడు మారుపాక రాజేశ్‌భరద్వాజ్, అర్బన్ కార్యదర్శి సుమంత్‌రావు, జిల్లా నాయకులు రాజేశ్వర్‌రావు, పవన్‌కుమార్, వంశీ, అజయ్, నారాయణ, శ్రీమాన్‌రెడ్డి, కరుణాకర్, షేక్ అంజద్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6:27 శుక్రవారం
సహర్ 4:43 శనివారం



సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై ఆగ్రహం



డీఈవో జనార్దన్‌రావుకు ఫిర్యాదు చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

గన్నేరువరం, మార్చి 28: మండలంలోని హనుమాజిపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సమయ పాలన పాటించడం లేదని విద్యార్థుల తల్లి దండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు డీఈవోకు ఫిర్యాదు చేశారు. డీఈవో స్పందించి వెంటనే ఉపాధ్యాయులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్పందించిన డీఈవో సీహెచ్ జనార్దన్‌రావు హనుమాజిపల్లి ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు.

విధులకు గైర్హాజరైన ఉపాధ్యాయురాలి సస్పెన్షన్

కరీంనగర్ టౌన్: విధినిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించి విధులకు గైర్హాజరైన హనుమాజిపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి భాగ్యలక్ష్మిని జిల్లా విద్యాశాఖ అధికారి సీహెచ్‌వీఎస్ జనార్దన్‌రావు సస్పెండ్ చేశారు. విధులకు ఆలస్యంగా హాజరైన మరో ఇద్దరు ఉపాధ్యాయులపై కూడా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ముందస్తు అనుమతి లేకుండా పాఠశాలకు గైర్హాజరైన సిబ్బంది వివరాలు తమ దృష్టికి తీసుకువస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

కనీస సౌకర్యాలు కరువు

> ఉపాధి కూలీలు పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండలు పెరుగుతుండడంతో 12 గంటల వరకే పనులు ముగిస్తున్నారు. పని చేసే ప్రదేశాల్లో తాగునీటి సౌకర్య కల్పించడం లేదు. ఫస్ట్ ఎయిడ్ కిట్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచడం లేదు. పని చేసే ప్రాంతాలు గ్రామాలకు దూరంగా ఉంటాయి. ఎవరైనా కూలీలు అస్వస్థతకు గురైతే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇంత కష్టపడి పని చేసినా ప్రభుత్వం సక్రమంగా వేతనాలు చెల్లించడం లేదు. గతంలో చెల్లించిన సమ్మర్ అలవెన్స్‌ను నిలిపివేశారు. అధికారులు, ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని ఉపాధి కూలీలు కోరుతున్నారు.

- ఎండలు ముదరడంతో ఇబ్బంది పడుతున్న ఉపాధి కూలీలు
- చెట్లకింద సేద తీరుతున్న వైనం
- నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు



మానకొండూర్ మండలం వేగురుపల్లిలో ఉపాధిహామీ పనుల్లో కూలీలు

గన్నేరువరం, మార్చి 28, మండుటెండలో పని చేస్తున్న ఉపాధి హామీ కూలీలకు సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఎండ తీవ్రత రోజు రోజుకీ పెరుగుతుండటంతో మండల వ్యాప్తంగా ఉపాధిహామీలో భాగంగా పనిచేసే స్థలాల్లో కనీస వసతులు లేకపోవడంతో కూలీలు చెట్లకింద సేద తీరుతున్నారు. నీడ వసతి, మెడికల్ కిట్‌లు, నీటి సౌకర్యం లేక అవస్థలు పడుతున్నామని కూలీలు చెబుతున్నారు. మండలంలోని 16 గ్రామాల్లో 5,666 జాబ్ కార్డులకు గాను 10,379 మంది కూలీలున్నారు. ప్రస్తుతం వీరిలో రోజుకు 4,240మంది పనులకు వెళుతున్నారు. ప్రతిరోజు ఉదయం 6నుంచి 11 గం టల లోపలే పనులు ముగించుకుంటున్నారు. పని ప్రదేశాల్లో కొలతల ప్రకారం పని చేసినా రికార్డుల్లో తక్కువ నమోదు చేసుకొని శ్రమకు తగ్గ వేతనాన్ని అందించడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలలకోసారి కూలి డబ్బులు వస్తుండడంతో ఇబ్బంది పడుతున్నామంటున్నారు.

● **తిమ్మాపూర్:** జాతీయ ఉపాధి హామీలో భాగంగా పనులు చేసే కూలీలకు అధికారులు కనీస వసతులు కల్పించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలో 23 గ్రామ పంచాయితీలు ఉండగా మండల వ్యాప్తంగా 5,177మంది ఉపాధి హామీ కూలీలున్నారు. ఇందులో ప్రస్తుతం 1,430 మంది మాత్రమే పనులకు వెళుతున్నారు. ప్రస్తుతం మండలంలోని ఫాంపాండ్, వ్యవసాయ అను సంధానంగా ఉన్న రోడ్ల మరమతులు, చెరువు కట్టల అభివృద్ధి పనులు చేస్తున్నారు. ప్రస్తుతం ఎండలు మండిపోతున్నాయి. పని చేసే చోట ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో సంబంధితశాఖ అధికారులు విఫలమవుతున్నారు. పని చేసే ప్రదేశంలో కూలీలకు టెంట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స బాక్స్ కిట్లు, మంచి నీటి క్యాన్లు ఇతర సౌకార్యలు తప్పని సరిగా కల్పించాలని నిబంధనలున్నాయి.

మండలం వ్యాప్తంగా ఒకటి, రెండు గ్రామాల్లో తప్ప ఎక్కడా సౌకర్యాలు కల్పించడం లేదు. దీంతో ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండ తీవ్రతను తట్టుకోలేక పనులు మధ్య లోనే నిలిపివేసి ఇళ్లకు వెళుతున్నారు. ఎండలోనే కష్టపడి పని చేస్తున్నా కూలీ డబ్బులు అందడంలో జాప్యం జరుగుతోంది. ప్రస్తుతం ఫిబ్రవరి 15 వరకు మాత్రమే చేసిన పనికి డబ్బులు చెల్లించారని కూలీలు తెలి పారు. పని చేసే సమయంలో టెంట్లు లేక పోవడంతో చెట్ల కింద సేద తీరుతున్నారు. టెంట్లు వేయవల్సిన చోట కేవలం షెడ్‌నెట్ వేసి అధికారులు చేతుల దులుపుకుంటున్నారు.

● **మానకొండూర్:** మండలంలో 8,016 మంది ఉపాధి హామీ జాబ్‌కార్డులు ఉన్నాయి. ఉదయం ఏడు గంటల నుంచి పని చేస్తున్న కూలీలకు 250 రూపాయల వరకు కూలీ పడుతుంది. గురువారం మండలంలోని ఆయా గ్రామాల్లో 1,716 మంది కూలీలు ఉపాధిహామీ పని వెళ్లారు. చాలా గ్రామాల్లో వేతనాలు పెండింగ్‌లో ఉండడంతో కూలీలు ఇబ్బంది పడుతున్నారు.

● **చొప్పదండి:** మండలంలో ఉపాది హామీ పనులు అన్ని గ్రామాల్లో నడుస్తున్నాయి. మండల వ్యాప్తంగా 5,115 మంది కూలీలు పని చేస్తున్నారు. పని ప్రదేశాల్లో కూలీలకు నీడ కల్పించాల్సిన అధికారులు అందుకు చర్యలు తీసుకోవడం లేదు. ఆర్థిక సంవత్సరం ముగిస్తున్న తరుణంలో లక్ష్యాన్ని పూరి చేసేందుకు పనులలో వేగాన్ని పెంచారు.

● **రామడుగు:** మండలంలో ఉపాధి పనులు జోరుగా సాగుతున్నాయి. మండల వ్యాప్తంగా 1,650 మంది కూలీలుపనులు చేస్తున్నారు. చెరువుల పూడికతీత, కాలువులు, కందకాలు, రోడ్డు నిర్మాణం లాంటి పనులు జరుగుతున్నాయి. పనుల వద్ద చల్లని నీరుమాత్రమే ఏర్పాటు చేసి టెంట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లుసమకూర్చకపోవడంతో కూలీలు ఇబ్బంది పడుతున్నారు.

● **చిగురుమామిడి:** మండలంలోని 17 గ్రామాల్లో ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం మండల వ్యాప్తంగా 1,350 మంది పనులు చేస్తున్నారు. పనులు జరిగే స్థలంలో కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో కూలీలు ఇబ్బందిపడుతున్నారు. గతంలో కూలీలకు కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 20 శాతం, మార్చిలో 30 శాతం, ఏప్రపిల్, మే నేలలో 40 శాతం కూలీల వేతనాలపై అదనంగా సమ్మర్ అలవెన్స్ చెల్లించేది. ప్రస్తుతం సమ్మర్ అలవెన్స్‌ను తొలగించింది. ఏప్రిల్ నుంచి ప్రతి కూలీకి 300 రూపాయాలు వేతనం చెల్లిస్తామని అధికారులు అంటున్నారు.

● **గంగాధర:** మండలంలోని 33 గ్రామాల్లో ఉపాధి పనులు చురుకుగా సాగుతున్నాయి. ఎండలు పెరగడంతో ఉదయం ఎనిమిది నుంచి 12:30 వరకు పని చేయిస్తున్నారు. 1,914 మంది ఉపాధి పనులు చేస్తున్నారు. పని ప్రదేశంలో కూలీలకు నీడ సౌకర్యం కల్పించడ లేదు. ప్రథమ చికిత్స కిట్లు కనిపించడం లేదు. పని ప్రదేశంలో మంచినీటి సౌకర్యం, నీడకు షెడ్లను ఏర్పాటు చేయాలని కూలీలు కోరుతున్నారు.





తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్‌లో, చొప్పదండిలో ఎండలో ఉపాధిహామీ పనుల్లో కూలీలు

పచ్చునూర్‌లో కేంద్ర బలగాల కవాతు

మానకొండూర్, మార్చి 28: పార్లమెంట్ ఎన్నికలలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మండలంలోని పచ్చునూర్ గ్రామంలో గురువారం స్థానిక సీఐ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులు కవాతును నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రాజ్‌కుమార్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రజలకు భరోసా కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

- వివరాలు వెల్లడించిన ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి

ధర్మపురి, మార్చి 28: ధర్మపురి మండలంలోని కమలాపూర్ గ్రామంలో పులి పద్మ అనే మహిళను హత్య చేసిన కేసులో నిందితుడు పులి గంగయ్య గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన నిందితుడి అరెస్ట్ వివరాలు ఆయన వెల్లడించారు. పులి పద్మకు ఆమె ఇంటి పక్కనే ఉన్న పులి గంగయ్యకు కొంత కాలం నుంచి భూమి సరిహద్దు విషయంలో గొడవలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. గ్రామంలో కాటమయ్య పండుగ జరుగగా నిందితుడు గంగయ్య హాజరయ్యాడని ఆయన తెలిపారు. ఆ సమయంలో గంగయ్య భార్య పులి రేణుక ఇంటిలో ఎవరు లేని సమయంలో వంట గదిలో చీరెతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఆయన వివరించారు. నిందితుడు గంగయ్య ఇంటికి వచ్చి చూసే సరికి భార్య చనిపోయి ఉండటం వల్ల పులి పద్మనే కారణమని భావించి ఉలి తీసుకుని ఆమెను ఇంట్లో విచక్షణా రహితంగా పొడిచి హత్య చేసినట్లు ఆయన అన్నారు. పద్మ భర్త లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు నిందితుడు గంగయ్యను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి, రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు. సమావేశంలో ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐ ఉదయ్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.7,500 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, మార్చి 28: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,500 రూపాయలు పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు 46మంది రైతులు 609క్వింటాళ్లు విడి పత్తి, ఎనిమిది మంది రైతులు పది క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,500, కనిష్ఠ ధర 4వేల రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. శుక్ర, శని, ఆదివారాల్లో కొనుగోళ్లు ఉండవని, తిరిగి సోమవారం నుంచి ప్రారంభం అవుతాయని అధికారులు తెలిపారు.

పీఆర్ ఏఈకి షోకాజ్ నోటీసులు జారీ

ఇల్లందకుంట, మార్చి 28: ఇల్లందకుంట మండల పంచాయతీరాజ్ ఏఈ రాంబాబుకు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి షోకాజ్ నోటీసులు గురువారం జారీ చేశారు. ఇల్లందకుంట, వీణవంక మండలాలకు చెందిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద బోగంపాడు, ఇల్లందకుంట, వంతడుపుల గ్రామాలకు రూ. 30లక్షలు అంతర్గత రోడ్లకు నిధులు మంజూరయ్యాయి. కాగా పనులు చేపట్టడంలో ఏఈ రాంబాబుకు నిర్లక్ష్యం గా వ్యవహరించడంతో జిల్లా కలెక్టర్ నోటీసులు జారీ చేశారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లోని ఈజీఎస్ పనులు మార్చి 31లోపు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

విద్యుత్ స్తంభంపై నుంచి పడి ఒకరికి తీవ్రగాయాలు

మానకొండూర్, మార్చి 28: మానకొండూర్‌లో గురువారం విద్యుత్ స్తంభం పై నుంచి పడి జూనియర్ లైన్‌మన్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. మానకొండూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో పని చేస్తున్న జూనియర్ లైన్‌మెన్ బాలక్రిష్ణ 33కేవి లైన్ బ్రేక్‌డౌన్ మరమ్మతు పనులు చేస్తున్నారు. ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభంపై నుంచి కిందపడి తీవ్రగాయాల పాలయ్యాడు. చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. సబ్‌స్టేషన్‌లో పూర్తి స్థాయిలో సిబ్బంది ఉన్నప్పటికీ జూనియర్ లైన్‌మన్‌తో పనులు చేయించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు నలువల స్వామి డిమాండ్ చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

తిమ్మాపూర్, మార్చి 28: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో వినియోగం లోకి ఓ పెట్రోల్ బంక్ ఖాళీ స్థలంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించింది. ఎల్ఎండీ ఎస్సై చేరాలు తెలిపిన వివరాల ప్రకారం.. ఖాళీ స్థలములో కొబ్బరి చెట్ల కింద గుర్తు తెలియని మగ వ్యక్తి శవం ఉన్నట్లు స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు వెళ్లి పరిశీలించారు. అతడు 15 రోజులుగా గ్రామంలో మానసిక స్థితి బాగాలేక రోడ్డు వెంబడి తిరిగినట్లు స్థానికులు తెలిపారు. ఎండ వేడిమికి వడదెబ్బ కారణంగానే అతడు మృతి చెంది ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయితీ కార్యదర్శి అరుణ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. మృతదేహన్ని కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించామని ఎస్సై చేరాలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

పెద్దపల్లి రూరల్, మార్చి 28 : పెద్దపల్లి మండలం అప్పన్నపేట గ్రామానికి చెందిన పుట్ట మల్లయ్య(51) ద్విచక్ర వాహనం ఢీకొని చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లయ్య కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీలో కాంట్రాక్టు ఉద్యోగం చేస్తున్నాడు. బుధవారం పనులు ముగించుకొని ఇంటికి సైకిల్‌పై వస్తున్న క్రమంలో అందుగులపల్లి గ్రామానికి చెందిన ద్విచక్ర వాహనదారుడు పుల్లూరి గట్టయ్య ఢీకొట్టాడు. దీంతో మల్లయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ తరలించారు. చికిత్స పొందుతూ అదే రాత్రి మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు పుట్ట సతీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి తెలిపారు.

ఆర్టీసీ బస్సులో అస్వస్థతకు గురై ప్రయాణికుడి మృతి

మెట్‌పల్లి, మార్చి, 28 : మెట్‌పల్లి పట్టణ శివారులో ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న భోగం సామయ్య(70) అనే వృద్ధుడు అస్వస్థతకు గురై చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..కరీంనగర్ జిల్లా వీణవంక మండలానికి చెందిన భోగం సామయ్య కుటుంబ సభ్యులతో కలిసి నిజామాబాద్‌లో ఉంటున్నాడు. పనుల నిమిత్తం తన సొంత గ్రామానికి వెళ్లి తిరిగి గురువారం తన చెల్లెలితో కలిసి హుజూరాబాద్ డీపోకు చెందిన బస్సులో నిజామాబాద్‌కు బయలు దేరారు. మెట్‌పల్లి పట్టణ అనుబంధ గ్రామమైన వెంకట్రావుపేట చేరుకోగానే సామయ్య ఊపిరాడక పడిపోయాడు. గమనించిన తోటి ప్రయాణికులు వెంటనే 108కు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి వచ్చిన అంబులెన్స్‌లో సామయ్యను మెట్‌పల్లి ప్రభుత్వ ఆసపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. పరిమితికి మించి ప్రయాణికులు బస్సులో ఎక్కడంతో ఊపిరాడక గుండె పోటు వచ్చి మృతి చెందినట్లు ప్రయాణికులు పేర్కొన్నారు.

ఉత్తమ రైతుకు సన్మానం


రైతును సన్మానిస్తున్న శాస్త్రవేత్తలు

రాయికల్, మార్చి 28: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయంలో గురువారం విస్తరణ సలహా సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన ఓరుగంటి భీమరాజ్‌ను ఉత్తమ రైతుగా ఘనంగా సన్మానం చేశారు. రైతులు వారు పండించిన పంటలపై వారికి ఉన్న సమస్యల పరిష్కారం, పెట్టుబడి తగ్గించి ఎక్కువ లాభాలను ఏ విధంగా సమకూర్చుకోవచ్చునని శాస్త్రవేత్తలు వివరించారు. కార్యక్రమంలో ఏడీఆర్ డాక్టర్ జి.శ్రీనివాస్, అల్లీపూర్ దత్తత గ్రామ ఇన్‌చార్జి డాక్టర్ డీఏ రజనీ దేవి, ఆర్థిక శాస్త్రవేత్త, పొలాస శాస్త్రవేత్తల బృందం, అల్లీపూర్ ఎఫ్‌ఈవో అధ్యక్షుడు అత్తినేని శంకర్, రైతులు ఓరుగంటి రాజలింగం, ఓరుగంటి రాజు, ఎల్లేశ్వరం శేఖర్, గొల్లపల్లి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన


హుజూరాబాద్‌రూరల్, మార్చి 28: మండలంలోని ఇప్పలనర్సింగాపూర్ గ్రామంలో తెలంగాణ ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో గురువారం లోహియా ఎడిబుల్ ఆయిల్ కంపెనీ సిబ్బంది ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా కంపెనీ సీఈవో సిద్దాంత్ లోహియా రైతులు వేసవి కాలంలో మొక్కలకు సరిపడా నీరు అందించాలన్నారు. కార్యక్రమంలో కంపెనీ మేనేజర్ భారత్, రైతు గూడురు స్వామిరెడ్డి, కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్ వేణు, కాటిపల్లి సంజీవరెడ్డి, రాజిరెడ్డి, రామచంద్రం, పల్లె వీరయ్య, మల్లు, గాజ తిరుపతి, సామల కోటిరెడ్డి, గూడురి చైతన్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్‌లో ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

మల్లాపూర్, మార్చి, 28: జగిత్యాల జిల్లా మల్లాపూర్ పోలీసు స్టేషన్‌లోనే ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేస్తూ ఎస్పీ సన్ ప్రీత్‌సింగ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 17న మల్లాపూర్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్ ధనుంజయ్, సురేష్, హెడ్ కానిస్టేబుల్ అశోక్ అను ముగ్గురు మండలంలోని కొత్తధాంరాజుపల్లి, గుండంపల్లి గ్రామాలకు చెందిన ఇద్దరు రాజకీయ నాయకులతో కలిసి రాత్రి పోలీసు స్టేషన్‌లో చేసుకున్న మందు పార్టీ వెలుగులోకి వచ్చింది. ప్రజలకు బాధ్యతగా ఉండాల్సిన పోలీసు సిబ్బంది తమ విధులను మరిచి రాజకీయ నాయకులతో కలిసి విందు చేసుకున్న ఘటనపై ఉన్నతాధికారులకు తెలయడంతో ధనుంజయ్, సురేష్‌లను సస్పెండ్ చేయగా హెడ్ కానిస్టేబుల్ అశోక్‌పై శాఖా పరమైన చర్యల నిమిత్తం మల్టీ జోన్-1 ఐజీకి నివేదిక పంపించినట్లు ఎస్పీ పేర్కొన్నారు. నివేదిక ఆధారంగా హెడ్ కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.

టేకు దుంగల పట్టివేత

మల్లాపూర్, మార్చి, 28 : మండలంలోని గొర్రెపల్లి గ్రామ శివారులోని అక్రమంగా నిలువ చేసిన టేకు దుంగలను అటవీ శాఖ అధికారులు డీవైఆర్‌వో చంద్రమౌళి, ఎఫ్‌బీవో సత్తార్‌లు పట్టుకున్నట్లు గురువారం తెలిపారు. అటవీ శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...గ్రామ శివారులోని రూంలో గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా టేకు దుంగలను నిలవ చేసిన పక్క సమాచారం మేరకు సిబ్బందితో దాడులు చేశామన్నారు. అక్రమంగా నిల్వ చేసిన టేకు దుంగలను స్వాధీనం చేసుకొని దొంగల కోసం గాలింపు చర్యలు చేస్తున్నట్లు తెలిపారు. పట్టుకొన్న టేకు దుంగల విలువ సుమారు రూ. 1,50 వేలే ఉంటుందని అంచనా వేశారు. పట్టుకున్న దుంగలను రేంజ్ టింబర్ డిపోకు తరలించినట్లు తెలిపారు. దొంగలను త్వరలోనే పట్టుకొని చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.


నిండుగా ప్రవహిస్తున్న కెనాలు

నిండుగా కాకతీయ కాలువ

- నీళ్లు లేక వరదకాలువ వెలవెల

మల్యాల, మార్చి 28: ఎస్సారెస్పీ వరదకాలువలో నీరు లేక బోసిపోతుంటే.. నిండుగా ప్రవాహంతో ఎస్సారెస్పీ కాకతీయ కెనాల్ జలకళ సంతరించుకుంది. చివరి దశలో ఉన్న వరి పంటలకు చివరి తడి అందించేందుకు ఎస్సారెస్పీ నుంచి కాకతీయ కెనాల్‌కు అధికారులు నీళ్లు వదలగా వరదకాలువలో నీరు లేక కాలువ కింద సాగు చేసిన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. మల్యాల మండలంలో ఎస్సారెస్పీ వరదకాలువ, కాకతీయ కెనాల్ ఉన్నాయి. ఒక్క దానిలో నీరు, మరొక దానిలో నీరు లేకపోవడంలో రైతులు ఆందోళన చెందుతున్నారు.


నీరు లేక బోసిపోతున్న వరదకాలువ

కమనీయం శివపార్వతుల కల్యాణం

- జనసంద్రమైన వేములవాడ
- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన అధికారులు


స్వామివారల ఉత్సవమూర్తులు

వేములవాడ, మార్చి 28: ఆది దంపతులు పార్వతీ రాజరాజేశ్వర స్వామి వారల దివ్య కల్యాణం వేములవాడ పుణ్యక్షేత్రంలో గురువారం కన్నుల పండువగా సాగింది. దక్షిణ కాశీగా, భూలోక కైలాసంగా హరిహర క్షేత్రంగా విరాజిల్లుతున్న వేములవాడ రాజరాజేశ్వరస్వామివారి దేవస్థానంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని ఆలయ అర్చకులు, వేదపండితులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో అర్చకులు, వేదపండితులు స్వామివారికి ముందుగా మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, కల్యాణ క్రతువును ప్రారంభించారు. తొలుత ధ్వజారోహణం అనంతరం వరుడు రాజరాజేశ్వరస్వామివారు, వధువు పార్వతీదేవి అమ్మవార్లను వేద మంత్రోచ్చరణలు, మేళతాళాలతో ఎదుర్కొన్నారు. ఆలయ ఈవో కృష్ణప్రసాద్ ఆలయం తరుపున స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించగా, మున్సిపాలిటీ తరుపున కమిషనర్ అన్వేష్ పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. అనంతరం స్వామి వారల ఉత్సవమూర్తులను ఆలయ చైర్మన్ గెస్ట్‌హౌస్ ఎదురుగా ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై ఉంచి అభిజిత్ లగ్న సుముహూర్తమున ఉదయం 10-50 గంటలకు వేదమంత్రోచ్చరణలు, మంగళ వాయిద్యాల మధ్య మాంగళ్యధారణ గావిం చారు. స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్-ఇందిర దంపతులు కన్యాదాత లుగా వ్యవహరించారు. రాష్ట్ర ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, ఆలయ అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.


కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

● కల్యాణం వీక్షించేందుకు..

పార్వతీరాజరాజేశ్వరస్వామివారల కల్యాణం వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు వేములవాడకు తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులు, శివపార్వతులు ఒకరిపై ఒకరు తలంబ్రాలు పోసుకొని తన్మయత్వం చెందారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వేలాది మంది శివపార్వతులు, భక్తులు కల్యాణోత్సవాన్ని తిలకించి మురిసిపోయారు. కల్యాణం జరుగుతున్నంత సేపు చేతిలో త్రిశూలాలను కదిలిస్తూ శివనామ స్మరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం, మేన్‌రోడ్డు ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్లపై భక్తులు స్వామివారి కల్యాణం తిలకించారు. ఆలయ ఈవో కృష్ణప్రసాద్, అధికారులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. స్థానిక డీఎస్పీ కే.నాగేంద్రచారి నేతృత్వంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా సాయంత్రం నాలుగు గంటలకు శివపురాణం, ప్రధాన హోమం, సప్తపది, లాజాహోమము, ఔపాసనము, బలిహరణము నిర్వహించారు. అనంతరం పెద్దసేవపై స్వామివారలను ఊరేగించారు.


స్వామివారి ఎదుర్కోళ్లు నిర్వహిస్తున్న భక్తులు


మంగళసూత్రం చూపుతున్న అర్చకుడు


పట్టువస్త్రాలు అందజేస్తున్న ఆలయ ఈవో, మున్సిపల్ కమిషనర్

రాయికల్‌లో గంజాయి పట్టివేత

● మైనర్‌తో పాటు ముగ్గురు నిందితుల అరెస్టు ● వివరాలు వెల్లడించిన డీఎస్పీ రఘుచందర్



మాట్లాడుతున్న డీఎస్పీ రఘుచందర్

రాయికల్, మార్చి 28: గంజాయి అక్రమంగా రవాణా చేస్తూ అడ్డాల వద్ద విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్న మైనర్‌తో సహా మరో ఇరువురు వ్యక్తులను గురువారం సాయంత్రం వాహనాల తనిఖీల్లో పట్టుకున్నట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. జగిత్యాల పట్టణానికి చెందిన పాత నేరస్థులైన కొండూరి రాజేష్, ఆరుముల్ల సాయి కుమార్, ఓ బాలుడు జగిత్యాల నుంచి రాయికల్‌కు గంజాయిని సరఫరా చేస్తూ రాయికల్ మండలం కుమ్మరిపెల్లి స్టేజీ వద్ద పట్టుబడినట్లు డీఎస్పీ తెలిపారు. వీరి వద్ద నుంచి 1.5 కిలోల ఎండు గంజాయి, మూడు సెల్‌ఫోన్‌లు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టులో హాజరుపరుచనున్నట్లు తెలిపారు. రాయికల్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం రాత్రి విలేకరుల సమావేశంలో కేసు వివరాలను డీఎస్పీ వెల్లడించారు. ఇటీవల గంజాయి కేసులో రిమాండ్ అయిన పెనుగొండ గణేష్, మాలావత్ సతీష్‌తో జగిత్యాల పట్టణానికి చెందిన కొండూరి రాజేష్, ఆరుముల్ల సాయి కుమార్‌తో పాటు మరో బాలుడు ఒక గ్రూప్‌గా ఏర్పడ్డారు. వీరు సీసీఎల్ దగ్గరికి వెళ్లి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి జగిత్యాల జిల్లాకు అక్రమంగా తీసుకువచ్చి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు తమ విచారణలో తేలిందన్నారు. ఈ గ్రూప్ సభ్యుల్లో కొందరు మైనర్లకు గంజాయిని అలవాటు చేశారని, ఈ నేపథ్యంలోనే ఈ నెల 25న గంజాయి తక్కువ ధరకు విక్రయించి గురువారం రాయికల్‌కు అక్రమంగా తీసుకువస్తుండగా తమ వాహనాల తనిఖీలో అనుమానాస్పదంగా కనిపించడంతో పట్టుకుని విచారించామన్నారు. వీరిని పట్టుకోవడంలో కృషి చేసిన సీఐ, ఎస్సై, పోలీస్ సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. పట్టుబడిన ఇరువురు నిందితులపై జగిత్యాల, వరంగల్ జిల్లాల్లోని మూడు స్టేషన్‌ల పరిధిలో పాత కేసులు ఉన్నాయని వివరించారు. ఈ సమావేశంలో జగిత్యాల రూరల్ సీఐ ఆరిఫ్ అలీ ఖాన్, ఎస్సై అజయ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

● నా కుమారుడు ఎలాంటి తప్పు చేయలేదు..

నా కుమారుడు ఎలాంటి తప్పు చేయలేదని ఆరుముల్ల సాయి కుమార్ తల్లిదండ్రులు గంగాధర్, రజిత అన్నారు. గతంలో సాయి కుమార్ తప్పు చేసినప్పుడు పలు కేసులు నమోదయ్యాయని, ఆరు మాసాలుగా ఇంటి వద్దే ఉండి పని చేసుకుంటున్నాడని అన్నారు. తన కుమారుడు ఎటువంటి తప్పు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై డీఎస్పీ మాట్లాడుతూ తమ వద్ద ఆధారాలు ఉన్నాయని, అందుకే అరెస్టు చేశామని తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

పెగడపల్లి: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకుని పెగడపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం పెగడపల్లి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ వివరాలు వెల్లడించారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కొండాయపల్లికి చెందిన ఇడుగునూరి వంశీకృష్ణ , మరో బాలుడు అక్రమంగా గంజాయి తరలిస్తుండగా స్థానిక నంది చౌరస్తా వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా నుంచి ద్విచక్ర వాహనంపై గంజాయి తీసుకుని వస్తుండగా నంది చౌరస్తా వద్ద పెగడపల్లి ఎస్.ఐ జాడి రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా వారు పారిపోయే ప్రయత్నం చేశారు. దీంతో వెంబడించి పట్టుకున్నట్లు తెలిపారు. వారిని తనిఖీ చేయగా వారి వద్ద ఉన్న బ్యాగులో 900 గ్రాములు గంజాయి లభించినట్లు తెలిపారు. గంజాయి, ద్వాచక్ర వాహనం స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు డిఎస్పీ రఘుచందర్ వివరించారు. ఈ సమావేశంలో మల్యాల సీఐ నీలం రవి, పెగడపల్లి ఎస్.ఐ జాడి రామకృష్ణ, ఏఎస్ఐ సత్తయ్య, పోలీస్ సిబ్బంది రవీందర్, వెంకట్ రెడ్డి, తిరుపతి, ఎల్లయ్య తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తులను పట్టుకున్న పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ అభినందించారు.

హత్యకేసులో నిందితుడికి జైలు

మంథని, మార్చి 28: హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడికి 3 ఏళ్ల జైలు శిక్ష, రూ.3వేల జరిమానా విధిస్తూ మంథని సీనియర్ సివిల్ జడ్జి భారతి గురువారం తీర్పునిచ్చారు. మంథని మండలం బట్టుపల్లి గ్రామానికి చెందిన గుండ్ల సదయ్య అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన దూపం శ్రీనివాస్ ఇంట్లోకి 11మే 2023న అక్రమంగా చొరబడి గొడ్డలితో దాడి చేశాడు. దీంతో బాధితుడు శ్రీనివాస్ భార్య దూపం స్వప్న మంథని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్ఐ వెంకటేశ్వర్ కేసు నమోదు చేసి విచారణ అనంతరం నిందితుడు సదయ్యను రిమాండ్‌కు తరలించారు. కేసు విచారణ పూర్తి అనంతరం మంథని కోర్టులో పోలీసులు చార్జిషీటు దాఖలు చేశారు. ఇరువురి వాదనలు విన్న అనంతరం న్యాయమూర్తి భారతి నిందితుడు గుండ్ల సదయ్య దాడి పాల్పడినట్లు నేరం రుజువు కావడంతో 3 సంవత్సరాల జైలు శిక్షతో పాటు జరిమానాను విధించారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఐదుగురికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, మార్చి 28: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒక వ్యక్తికి ఏడు రోజుల జైలు శిక్ష, మరొకరికి ఐదు రోజుల జైలు శిక్ష, ముగ్గురు వ్యక్తులకు మూడు రోజుల జైలు శిక్షతోపాటు జరిమానా పడిందని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీంఉల్లాఖాన్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ఇటీవల పోలీసులకు పట్టుబడిన 15 మందిని గురువారం కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా ఐదుగురికి జైలు శిక్ష, మొత్తం 9,500 రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు. మిగతా 10 మందికి 19,500 రూపాయల జరిమానా విధించారని తెలిపారు. ఇప్పటి వరకు ఈ సంవత్సరములో 102 మందికి జైలు శిక్ష పడిందని సీఐ పేర్కొన్నారు. జైలు శిక్ష పడిన వ్యక్తుల డ్రైవింగ్ లైసెన్స్‌లు సస్పెండ్ చేయడానికి ఆర్టీఏ కార్యాలయానికి సిఫారసు చేస్తామన్నారు.

నర్సింగాపూర్‌లో చోరీ


పరిశీలిస్తున్న పోలీసులు

చందుర్తి, మార్చి 28: చందుర్తి మండలం నర్సింగాపూర్ గ్రామంలో ఒకరి ఇంట్లో గుర్తులేని వ్యక్తులు చొరబడి వెండి పట్టగొలుసులు ఎత్తుకెళ్లారు. గ్రామస్తుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన భైరగోని మల్లేశం అనే వ్యక్తి వేములవాడలోని ఉంటాడు. నర్సింగాపూర్ గ్రామంలో ఉండే ఇంట్లో భద్రపరిచిన 10 తులాల వెండి పట్టగొలుసులను తీసుకెళ్లేందుకు గ్రామానికి గురువారం రాగ ఇంటి తలుపుల తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగ 10 తులాల పట్టా గొలుసులు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

కారు, బైకు ఢీ.. వృద్ధురాలు మృతి

కాల్వశ్రీరాంపూర్, మార్చి 28: కారు, బైకు ఢీకొని వృద్ధురాలు మృతిచెందిన సంఘటన మండలంలోని మిర్జంపేటలో చోటుచేసుకుంది. మృతురాలి బంధువులు చెప్పిన వివరాల ప్రకారం.. ఓదెల మండలం గుంపుల గ్రామానికి చెందిన తిప్పారపు ఓదమ్మ(75) తన మనవడు విగ్నేష్‌తో కలిసి మండలంలోని మిర్జంపేటలో దశదిన కార్యక్రమానికి వచ్చి గురువారం ద్విచక్ర వాహనంపై తిరిగి గుంపులకు వెళుతుండగా గ్రామ శివారులో ప్రమాదవశాత్తు కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. దీంతో ద్విచక్ర వాహనం వెనుక కూర్చున్న ఓదెమ్మ తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. తిప్పారపు మహేష్ తలకు, కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. చావు బతుకుల్లో కొట్టుమిట్టాడుతున్న విగ్నేష్‌ను కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు. ఈ విషయంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ ఓంకార్ యాదవ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సీయూఈటీ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలి

- ఎన్‌టీఏ సిటీ కోఆర్డినేటర్ లలితకుమారి

తిమ్మాపూర్, మార్చి28: అర్హులైనా అభ్యర్థులు సీయూఈటీ పరీక్షకు దరఖాస్తు చేసుకునే విధంగా ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల ప్రిన్సిపాళ్లు, యాజమాన్యం విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఎన్‌టీఏ సిటీ కోఆర్డినేటర్ లలితకుమారి గురువారం ఒక ప్రకటనలో కోరారు. నేషనల్ టెస్టింగ్ ద్వారా నిర్వహించే కామన్ యూనివర్శిటీ ఎంట్రన్స్ టెస్ట్(సీయూఈటీ(యూజీ)- 2024)ను కేంద్ర విద్యా శాఖ, యూజీసీ తప్పనిసరి చేసిందని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ టి లలితకుమారి తెలిపారు. ఈ పరీక్ష కేంద్ర విద్యా శాఖ పరిధిలో ఉండే కేంద్ర విశ్వ విద్యాలయాలు, ఇతర విశ్వ విద్యాలయాలు, సంస్థలు, స్వయం ప్రతిపత్తి కళాశాలలో, అండర్ గ్రాడ్యుయేట్ కోర్సు కోసం నిర్వహించే ప్రవేశ పరీక్ష అని తెలిపారు. ఈసీయూఈటీ పరీక్ష దేశంలోని అన్ని కేంద్ర విశ్వ విద్యాలయాలు, ఇతర ప్రైవేటు విశ్వ విద్యాలయాలలో ప్రవేశం పొందడానికి అవకాశం కల్పిస్తుందని చెప్పారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 200 విశ్వవిద్యలయాలు, 46 కేంద్ర విశ్వ విద్యాలయాలు, 30 రాష్ట్ర విశ్వ విద్యాలయాలు, 9 డీమ్డ్(స్వయం ప్రతి పత్తి), 113 ప్రైవేటు విశ్వవిద్యాలయాలు, 6 ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు ఉన్నాయని తెలిపారు. ఈసీయూఈటీ(యూజీ)-2004 వెబ్ సైట్‌లో ఫిబ్రవరి-2024న ప్రారంభించినట్లు చెప్పారు. మార్చి 31లో గడువు ముగియనుందని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు https//exams.nta.ac.in/CUET-UGలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ధర్మపురిలో ఘనంగా వేంకటేశ్వరుడి దక్షిణ, ఉత్తర దిగ్యాత్రలు


ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

ధర్మపురి, మార్చి 28: ధర్మపురి క్షేత్రంలో జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ వేంకటేశ్వర స్వామి దక్షిణ, ఉత్తర దిగ్యాత్రల కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య అర్చకులు స్వామి వారల ఉత్సవమూర్తిని సేవపై ఆశీనులు చేశారు. అనంతరం సేవను దక్షిణ దిశలో గల పోలీస్‌స్టేషన్, ఉత్తర దిశలో గల ఉసిరిక వాగు వద్దకు ఊరేగింపుగా తీసుకువెళ్లారు. స్వామి వారల కళ్యాణం, తెప్పె, డోలోత్సవం అనంతరం దక్షిణ, ఉత్తర దిగ్యాత్రల కోసం బయలు దేరడం ఏటా జరుగుతుంది. ఈ సందర్భంగా ఆయా ప్రదేశాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికల వద్ద సనాతన సాంప్రదాయ రీతిలో వేదపండితులు మంత్రోచ్చరణల మధ్య ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్య, యజ్ఞాచార్యులు కందాలై పురుషోత్తమాచార్యులు, తదితరులు రాత్రి వరకు ఉత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. దారి పొడవుగా మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి దంపతులు, ఎస్ఐ ఉదయ్‌కుమార్ దంపతులు, బుగ్గారం ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి, పోలీస్ కుటుంబ సభ్యులు వేదికల వద్ద ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, ఉత్సవ కమిటీ సభ్యులు రాపర్తి సాయి కిరణ్, మాదాసు మల్లేష్, స్తంభంకాడి గణేష్, కొమురెల్లి పవన్‌కుమార్, డాక్టర్ మామిడి రాజేష్, పెరుమాండ్ల ఎల్లాగౌడ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


స్వామి వారికి ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రాజ్‌కుమార్


పీవీ రాజ్‌కుమార్ రఘువీర్ బేతి మహేందర్‌రెడ్డి

కరీంనగర్ లీగల్, మార్చి 28: కరీంనగర్ బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం నిర్వహించి సాయంత్రం ఫలి తాలను ప్రకటించారు.అధ్యక్షుడిగా పీవీ రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా తిరుకోవెల రఘువీర్, ప్రధాన కార్యదర్శిగా బేతి మహేందర్‌రెడ్డి, సెక్రెటరీగా గుగ్లోత్ భీమా ఎన్నికయ్యారు. లైబ్రరీ కార్యదర్శిగా కటకం రాజేందర్, మహిళా ప్రతినిధిగా డి.రేణుక ఎన్నికయ్యారు. సీనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా కందుల అరుణ్‌కుమార్, నుంకె దేవకిషన్, మాతంగి రవీందర్, జూనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా పాస్తాం ఆంజనేయులు, కొండ్ర లక్ష్మణ్, బెజ్జంకి శ్రీకాంత్ ఎన్నికయ్యారు. కోశాధికారిగా రామగిరి శ్రీనివాస్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రెటరీగా మడిపల్లి రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల్లో 1030 మందికి 876 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎన్నికల అధికారిగా కాసుగంటి మాధవ్‌రావు వ్యవహరించారు.

హుజూరాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీనివాస్



హుజూరాబాద్ లీగల్, మార్చి 28: హుజూరాబాద్ బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం ముగిశాయి. అధ్యక్షుడిగా గోస్కుల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా బండి రమేష్, ప్రధాన కార్యదర్శిగా మట్టెల తిరుపతి, లైబ్రరీ సెక్రెటరీగా అప్పని రాజు, కోశాధికారిగా ఎం దివ్య, సీనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా పులుగు లింగారెడ్డి ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు కె భగవాన్‌రెడ్డి, సీకె జేమ్స్, ఎస్ సత్యనారాయణ తెలిపారు. మొత్తం 115మంది ఓటర్లకు గాను 113మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సహాయ కార్యదర్శిగా పి.జ్యోత్స్నదేవి, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రెటరీగా కల్వల సౌమిత్ర, జూనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా కె.సరిత, మహిళా సభ్యురాలుగా మౌనిక గతంలోనే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పేద కుటుంబాలకు రంజాన్ సామగ్రి పంపిణీ



సామగ్రి పంపిణీ చేస్తున్న హీర ఫౌండేషన్ సభ్యులు

కరీంనగర్ రూరల్, మార్చి 27: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని హీర ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు వంట సామగ్రిని పంపిణీ చేశారు. నగరంలోని 17, 18, 19 డివిజన్లలో ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ ముఫ్తి మహమ్మద్ ఫియాస్ మొహియుద్దీన్, హీర ఫౌండేషన్ అధ్యక్షుడు షేక్ అబూబకర్ ఖాలీద్‌లు వంట సామగ్రిని అందించారు. కార్యక్రమంలో హాఫీజ్ అహ్మద్ హిఫ్జి, హఫీజ్ ఫరీదొద్దీన్, కలీం షరీఫ్, మహమ్మద్ రఫీ, ముఖరం, అబ్దుల్ రాఫె, ముఫ్తి ఇంతియాజ్, కొత్తపల్లి కాంగ్రెస్ నాయకుడు ఖాజాఖాన్, సయీద్ మౌల్విసాబ్, ఖాజాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అన్నవరం, గంద్రకు ప్రతిభా పురస్కారాలు

కరీంనగర్ కల్చరల్, మార్చి 28: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ ప్రతిభా పురస్కారాలను కరీంనగర్‌కు చెందిన చిత్రకారుడు అన్నవరం శ్రీనివాస్‌కు, ప్రముఖ అవధాని గంద్ర లక్ష్మణ్‌రావుకు ప్రదానం చేశారు. గురువారం హైదరాబాద్‌లో విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య తంగెడ కిషన్‌రావు, ప్రఖ్యాత చలనచిత్ర దర్శకుడు, కవి బి.నర్సింగారావు చేతుల మీదుగా వారివురికి పురస్కారాలను అందించి సన్మానించారు. 2022 సంవత్సర ప్రతిభా పురస్కారాలు వీరిరువురితో పాటు మరో పది మంది వివిధ రంగాలకు చెందిన వారికి అందజేశారు. ఈకార్యక్రమంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ బట్టు రమేశ్ డైరెక్టర్ రింగు రామ్మూర్తి, కొలకలూరి ఇనాక్, డాక్టర్ అందెశ్రీ, నేదునూరి కనుకయ్య, తంగెడ నవనీతరావు పాల్గొన్నారు.

ఫోన్ ట్యాపింగ్‌పై డీజీపీకి ఫిర్యాదు

జమ్మికుంట రూరల్, మార్చి 28: ఫోన్ ట్యాపింగ్ ఘటనపై మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తుమ్మేటి సమ్మిరెడ్డి హైదరాబాద్‌లోని డీజీపీకి గురువారం ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హుజూరాబాద్ ఉప ఎన్నికల సమయం నుంచి ఫోన్ ట్యాపింగ్ జరుగుతోందని, మాజీ మంత్రి హరీశ్‌రావు అధికారులను గుప్పిట్లో పెట్టుకొని అరాచకాలు చేశాడన్నారు. ఒకే సామాజిక వర్గానికి చెందిన అధికారులతో ఫోన్ ట్యాపింగ్‌లు చేయించడం జరిగిందన్నారు. ఇప్పటికీ ఫోన్ ట్యాపింగ్‌లు జరుగుతున్నట్లు తెలుస్తోందని, వారిపై నిఘా పెట్టి వెంటనే అదుపులోకి తీసుకోవాలని కోరారు.

గ్రామాల్లో ఘర్షణ వాతావరణం సృష్టిస్తే కఠిన చర్యలు

హుజూరాబాద్‌రూరల్, మార్చి 28 : గ్రామాల్లో ఘర్షణ వాతావరణం సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హుజూరాబాద్‌టౌన్ సీఐ బొల్లం రమేష్ అన్నారు. గురువారం మండలంలోని సిర్సపల్లి, పోతిరెడ్డిపేట గ్రామాల్లో కరీంనగర్ సీపీ ఆదేశాల మేరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ ప్రధాన కూడళ్ల వద్ద గ్రామస్థులనుద్దేశించి మాట్లాడుతూ వాట్సాప్, ఫేస్‌బుక్ గ్రూపులలో అభ్యంతకరమైన మెసెజ్‌లు పంపరాదన్నారు. ఎలాంటి మీటింగ్‌లకైనా ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సహకరించాలన్నారు. ఈ ఫ్లాగ్ మార్చ్‌లో 40 మంది సీఐఎస్ఎఫ్ ఆఫీసర్స్, జవాన్లు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

కన్నుల పండువగా సీతారామ కల్యాణం

వీణవంక, మార్చి28: మండలంలోని వల్బాపూర్‌లో అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా గురువారం సీతారామచంద్రస్వామి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్, మాజీ ఎంపీ, కరీంనగర్ పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి బోయిన్‌పల్లి వినోద్ కూమార్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు మామిడాలపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ రాజరాజేశ్వర ఆలయం లో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో వినోద్‌కుమార్, కౌశిక్‌రెడ్డి వారి వెంట పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఆలయ చైర్మన్, అర్చకులు

తిమ్మాపూర్, మార్చి28: మండలంలోని నల్లగొండ గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ నృసింహస్వామి బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ గురువారం హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఆలయ కమిటీ చైర్మన్ లక్ష్మణ్‌తో పాటు కమిటీ సభ్యులు, ఈవో, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నా రు. అర్చకులు ఎమ్మెల్యేకు తీర్థ ప్రసాదాలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

జమ్మికుంట, మార్చి 28: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని హనుమండ్లపల్లి, మోత్కులగూడెం పరిధిలోని శ్రీబాలంజనేయస్వామి ఆలయ 18వ వార్షికోత్సవం సందర్భంగా కరీంనగర్ బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ పొనగంటి సంపత్‌లు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు టంగుటూరి రాజ్‌కుమార్, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

31లోగా ఆస్తి పన్ను చెల్లించాలి

జమ్మికుంట, మార్చి 28: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ప్రజలు 31లోగా ఆస్తి పన్ను చెల్లించాలని కమిషనర్ ఎండి ఆయాజ్ అన్నారు. గురువారం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఇంటి పన్నులు, ట్రేడ్ లైసెన్స్‌లు, నల్లా బిల్లులు ఈ నెల 31వరకు వసూళ్లు చేయాలని అధికారులకు సూచించారు. వందశాతం వసూళ్లకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

గ్రానైట్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ పాలక వర్గాన్ని రద్దుచేయాలి



గ్రానైట్ అసోసియేషన్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఫ్యాక్టరీ ఓనర్లు

కరీంనగర్ రూరల్, మార్చి27: జిల్లా గ్రానైట్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ పాలక వర్గాన్ని రద్దు చేయాలని కరీంనగర్ జిల్లా గ్రానైట్ ఫ్యాక్టరీల ఓనర్స్ డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా గ్రానైట్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ పాలక వర్గ నియంతృత్వ ధోరణికి వ్యతిరేకంగా జిల్లా గ్రానైట్ ఫ్యాక్టరీల ఓనర్స్ ఆధ్వర్యంలో కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రానైట్ ఫ్యాక్టరీల ఓనర్లు మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా గ్రానైట్ ఫ్యాక్టరీల సమస్యలు పరిష్కరించకుండా తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్నారు. పాలక వర్గం నియంతృత్వ ధోరణి అవలంబిస్తోందన్నారు. మూడు నెలల నుంచి జనరల్ బాడీ మీటింగ్ ఏర్పాటు చేయడం లేదని వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుతం అసోసియేషన్‌లో ఎంత డబ్బు ఉన్నది పూర్తి వివరాలు తెలపాలన్నారు. పది సంవత్సరాలుగా లెక్కలు చెప్పకుండా ఎన్ని కోట్లు మోసం చేశారని ప్రశ్నించారు. అసోసియేషన్ డబ్బులతో విదేశాలకు వెళ్లి జల్సాలు చేశారన్నారు. గ్రానైట్ అసోసియేషన్ బిల్డింగ్ ఆస్తులు ఎవరి పేరుతో రిజిస్ట్రేషన్ అయ్యాయని, డాక్యుమెంట్లపై కూడా అనుమానాలు ఉన్నాయన్నారు. అసోసియేషన్ సభ్యులంతా ఇక్కడికి వస్తే కార్యాలయానికి తాళం వేసి వెళ్లి పోయారన్నారు. దీనికి అసోసియేషన్ అధ్యక్షుడే పూర్తి బాధ్యత వహించాలన్నారు. గ్రానైట్ పరిశ్రమ రోడ్డున పడే పరిస్థితులు వచ్చాయని వెంటనే అసోసియేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా గ్రానైట్ ఫ్యాక్టరీస్ ఓనర్స్ జి.సుదర్శన్‌రెడ్డి, బి.సాగర్, ఆర్.విక్రమ్, కె.సత్యనారాయణ, టి.శ్యామ్‌రావు, కె.సతీష్‌రావు, శ్యాంసుందర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, పవన్ కుమార్, ఎస్.కరుణాకర్, జె.మధు, పి.సత్యం, ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాదిగలకు రెండు పార్లమెంట్ స్థానాలు ఇవ్వాలి

సుభాష్‌నగర్, మార్చి 28: మాదిగలకు రెండు పార్లమెంట్ స్థానాలు కేటాయించాలని మాదిగ జేఏసీ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయం ఎదుట మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో ఫ్లకార్డులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మాదిగలు 80 శాతం ఉన్నందున, జనాబా దామాష ప్రకారం మాదిగలకు వరంగల్, పెద్దపల్లి పార్లమెంట్ స్థానాలతో పాటు సికింద్రాబాద్ అసెంబ్లీ స్థానాన్ని కేటాయించాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఉస్మానియా యూనివర్సిటీని ఏకం చేసి నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన వ్యక్తి, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం విద్యార్థి దశ నుంచి నేటి వరకు పోరాడుతున్న వ్యక్తి ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన వ్యక్తి డాక్టర్ పిడమర్తి రవి అని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఆయనకు సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ టికెట్‌ను కెటాయించాలని కోరారు.

వరంగల్, పెద్దపల్లి పార్లమెంట్ స్థానాలపై పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మెడపట్ల దుబ్బయ్య, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల అధ్యక్షులు అక్కనపల్లి కరుణాకర్, అక్కపాక సంపత్, గుడిసె పవన్, చందు, నరేష్, బొంకూరి రాజేశ్వరి, ఆరెపల్లి పద్మ, శారద, పద్మ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

'కరీంనగర్ ఎంపీ కాంగ్రెస్ టికెట్ బ్రాహ్మణులకు కేటాయించాలి'

కరీంనగర్ టౌన్, మార్చి 28: లోక్‌సభ ఎన్నికల్లో కరీంనగర్ పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు బ్రాహ్మణులకే టికెట్ కేటాయించాలని అఖిల బ్రాహ్మణ సంఘం పార్టీ అధిష్టానాన్ని కోరింది. గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా బ్రాహ్మణ సంఘం కార్యాలయంలో నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఈమేరకు ఏకగ్రీవ తీర్మానం చేసి ఆమోదించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణాలోని 17 పార్లమెంట్ స్థానాల్లో బ్రాహ్మణులకు ఒక స్థానాన్ని కేటాయించాలని అఖిల బ్రాహ్మణ సేవా సంఘం ఉమ్మడి జిల్లాశాఖ కాంగ్రెస్ పార్టీని డిమాండ్ చేసింది. బ్రాహ్మణ కుటుంబాలు మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీకి వెన్నుదన్నుగా ఉంటూప్రతి ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థులకు మద్దతునిస్తూ వస్తున్న విషయాన్ని సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కస్బా భూమేశ్వర్ రావు, పురం ప్రేమ్‌చందర్‌రావు గుర్తుచేశారు. రాష్ట్రంలో అన్ని పార్టీలు బ్రాహ్మణుల పట్ల చిన్నచూపు చూస్తూ వారికి రాజకీయ అవకాశాలు లేకుండా చేస్తున్నాయని ఆరోపించారు. బ్రాహ్మణుల పట్ల రాజకీయ పార్టీలు వివక్ష చూపడం సరికాదని అన్నారు. బ్రాహ్మణులను విస్మరిస్తే ఆ పార్టీ కూడా మనుగడ సాధించలేదని వారు హెచ్చరించారు.

నిరంతరం ప్రజల మధ్య ఉంటూ ప్రజాశ్రేయస్సును కోరుకునే మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుం జయంకు కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వాలని కోరుతూ సోనియాగాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మసావేశంలో సంఘం అధ్యక్షుడు భూమేశ్వర్‌రావు, గౌరవ అధ్యక్షుడు నేదునూరి వామన్‌రావు, ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌చందర్‌రావు, ఉపాధ్యక్షులు జీవి రంగారావు, బండపల్లి ఉపేందర్‌శర్మ, యోగ మాస్టర్ సంపత్‌కుమార్, డాక్టర్ దీపక్‌బాబు, మూగ హరిశంకర్‌శర్మ, నాయకులు బొమ్మన రాధాకిషన్‌రావు, బొప్పరాజు అశోక్‌రావు, మూగ నాగన్న, రాజు, జీవి దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

జమ్మికుంట రూరల్, మార్చి 28: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలో పట్టణ సీఐ వరంగంటి రవి ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు గురువారం వాహనాల తనిఖీలు చేపట్టారు. డ్రంకెన్ డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్, నెంబరు ప్లేట్లు లేని ఐదు వాహనాలు సీజ్ చేశారు. ద్విచక్ర వాహనాలు నడుపుతున్న మైనర్లకు సీఐ కౌన్సిలింగ్ ఇచ్చారు.

కాంగ్రెస్‌లో చేరికలు

జమ్మికుంట రూరల్, మార్చి 28: జమ్మికుంట మండలం కోరపల్లికి చెందిన దొగ్గల భాస్కర్ కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజక వర్గ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ సమక్షంలో గురువారం పార్టీలో చేరారు. అదేవిదంగా పుల్లూరు సంపత్, కనకం కుమార్, రెంటాల కిరణ్, కొల్లూరు మురళి, నిశాంత్, రాజు, వాసు, రాజేందర్, తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

మహిళా సాధికారతపై వర్క్‌షాపు


మాట్లాడుతున్న డాక్టర్ కోర్వి వినయకళ

కరీంనగర్ రూరల్, మార్చి 27: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల నగునూరులో మహిళా సాధికారతపై గురువారం వర్క్‌షాపు నిర్వహించారు. తెలంగాణ సోషల్ వెల్ఫేర్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ కరీంనగర్ ఇంగ్లీష్ ఆచార్యులు డాక్టర్ కోర్వి వినయకళ, పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అమోలక్ సింగ్ ముఖ్య అతిథులుగా విచ్చేసి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాలప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ సుష్మ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కె లావణ్య, కామర్స్ విభాగాధిపతి డాక్టర్ ఆర్ ఉమాదేవి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

హాస్పిటల్ మేనేజ్‌మెంట్ కోర్సుతో ఉపాధి అవకాశాలు



మెమెంటోలను అందజేస్తున్న ఎస్ఆర్ఆర్ ప్రిన్సిపాల్ రామకృష్ణ

గణేశ్‌నగర్, మార్చి 28: హాస్పిటల్ మేనేజ్‌మెంట్ కోర్సుతో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కల్వకుంట రామకృష్ణ అన్నారు. ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాలలో హాస్పిటల్ మేనేజ్‌మెంట్ పీజీ, డిగ్రీ కోర్సులు, ఉపాధి అవకాశాల గురించి గురువారం సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కల్వకుంట రామకృష్ణ మాట్లాడుతూ కొవిడ్ సమయంలో ఎంతో మంది ప్రాణాలను డాక్టర్లు, సిబ్బంది కాపాడారన్నారు. విద్యార్థులు హాస్పిటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల వైపు ముందుకు సాగాలని వివరించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా నుంచి వచ్చిన డాక్టర్ ప్రియదర్శిని అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. స్టాఫ్ కాలేజ్‌లో పరిపాలన అధికారిగా పనిచేస్తున్న గోవిందు మాట్లాడుతూ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ కోర్సులకు చక్కటి ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. విద్యార్థులు పీజీ డిప్లొమా ఇన్ హాస్టల్ మేనేజ్‌మెంట్ చేసినట్లయితే చక్కటి వేతనంతో కూడిన ఉద్యోగాలు మనదేశంలో ఉన్నాయన్నారు. విదేశాల్లోనూ పీజీ డిప్లొమా ఇన్ హాస్టల్ మేనేజ్‌మెంట్ కోర్సుతో ఉద్యోగాలు పొందే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జంతు శాస్త్ర విభాగాధిపతి పి.రాజు, జిసిజిటిఏ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కే.సురేందర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి భువనాల, సురేష్ కుమార్ జంతుశాస్త్ర అధ్యాపకులు సిహెచ్ తిరుపతి, సుమలత, సమత, రవళి కృష్ణ, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఫేర్‌వెల్ డే


నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

గణేశ్‌నగర్, మార్చి 28: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం ఫేర్‌వెల్ డే నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు పాటలు, నాటికలు, డ్యాన్సులతో హోరెత్తించారు. విద్యార్థులు ప్రదర్శించిన జానపద నృత్యాలు అలరించాయి. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో కృషిచేసి ఉన్నత స్థానాలను అధిరోహించి కళాశాలకు మంచి పేరు తేవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అర్థశాస్త్ర విభాగాధిపతి మరోకండ శకుంతల, ఫిజికర్ డైరెక్టర్ శ్రీధర్ రావు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లలో రెండో స్థానం

- హుజూరాబాద్ మున్సిపాలిటీలో 92.12శాతం పూర్తి

హుజూరాబాద్, మార్చి 28: రాష్ట్రంలో హుజూరాబాద్ మున్సిపాలిటీ ఆస్తి పన్నుల వసూళ్లలో రెండో స్థానంలో నిలిచింది. హుజూరాబాద్ మున్సిపాలిటీ రూ. 2.49కోట్ల ఆస్తి పన్నులు బకాయిలు ఉన్నాయి. మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యతో పాటు మేనేజర్ రాంమోహన్‌రాయ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సంపత్‌రావు, సానిటరీ ఇన్‌స్పెక్టర్ కిషన్‌రావు, బిల్ కలెక్టర్లతో కలిసి ప్రతిరోజు మోఖాపై పన్నుల వసూళ్లు చేస్తూ ఈ నెల 27వరకు రూ. 2.29కోట్లు వసూళ్లు చేశారు. నూటికి 92.12శాతంతో రాష్ట్ర వ్యాప్తంగా హుజూరాబాద్ మున్సిపాలిటీ రెండో ర్యాంకు నిలిచింది. ఈ నెల 31వ తేదీ వరకు గడువు ఉన్నందున ఆస్తి పన్నులు, ట్రేడ్ లైసెన్స్, ఇతర షాపింగ్ గదుల కిరాయి బకాయిలు ఉన్న యజమానులు వెంటనే నిర్ణీత గడువులోగా చెల్లించి, పట్టణాభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య గురువారం కోరారు.

దేశాభివృద్ధిలో పరిశ్రమల పాత్ర కీలకం

హుజూరాబాద్‌రూరల్, మార్చి 28 : దేశాభివృద్ధిలో పరిశ్రమల పాత్ర కీలకమని కిట్స్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె శంకర్ అన్నారు. మండలంలోని సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంఎస్ఎంఈ తరపున దినేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ లిమిటెడ్ డిప్యూటీ మేనేజర్ పి ముత్తు కుమారన్ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సైన్స్ సెల్ కో ఆర్డినేటర్, డీన్ డాక్టర్ ఎం.వి సతీష్‌కుమార్, సమన్వయకర్త డీన్ డాక్టర్ యోగేష్ కుండలిక్ పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

సైదాపూర్, మార్చి 28: మండలంలోని అన్ని గ్రామాలలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి అనిల్ ప్రకాష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో గ్రామ ప్రత్యేకాధికా రులు, పంచాయతీ కార్యదర్శులతో తాగునీటిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరి, ఎంపీవో సురేందర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ తదితరులు పాల్గొన్నారు.

గన్నేరువరం: మండలంలోని వివిధ గ్రామాలలో తాగు నీటి ఎద్దడి రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై మండల ప్రత్యేక అధికారి రామానుజాచారి అధ్యక్షతన మండలంలోని గుండ్లపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవా లని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో తీగల శంకర్, ఎంపీవో నర్సింహారెడ్డి, తదితతరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం



మాట్లాడుతున్న సింగిల్‌విండో చైర్మన్ వెంకటరమణారెడ్డి

చిగురుమామిడి, మార్చి 28: రైతుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నామని సింగిల్ విండో చైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం సింగిల్ విండో చైర్మన్ అధ్యక్షతన సహకార సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 8 కోట్ల 67 లక్షల రూపాయల పంట రుణాలను రైతులకు అందించామని చెప్పారు. సొసైటీ ద్వారా 12 గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 3లక్షల ఇరవై ఏడు వేల క్వింటాళ్ల ధాన్యం సేకరించానలి తెలిపారు. సంఘం అభివృద్ధికి సహకరిస్తున్న రైతులకు, సంఘ సభ్యులకు, డైరెక్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో వైస్‌చైర్మన్ కరివేద మహేందర్‌రె డ్డి, డైరెక్టర్లు ముద్రకోల రాజయ్య, తాళ్లపెల్లి తిరుపతి, కూతురు రవీందర్‌రెడ్డి, అందె స్వామి, పోతరవేణి శ్రీనివాస్, చాడ శ్రీధర్‌రెడ్డి, మాచమల్ల లచ్చవ్వ, పేరాల లక్ష్మీ, సంఘం కార్యదర్శి కాటం నర్సయ్య, సిబ్బంది శ్రీనివాస్, కుమారస్వామి, లింగయ్య, పవన్ తదితరులు పాల్గొన్నారు.

'ఎస్సీ, ఎస్టీ అధికారులకు సముచిత ప్రాధాన్యం ఇవ్వాలి'

సుభాష్‌నగర్, మార్చి 28: రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు పోస్టింగుల్లో సముచిత ప్రాధాన్యం కల్పించాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు ఎస్సీ, ఎస్టీ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు పోస్టింగ్ ఇవ్వడంలో గత ప్రభుత్వం కుల వివక్ష చూపించిందని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ అధికారులకు జిల్లా కలెక్టర్లుగా, ఎస్పీలుగా పోస్టింగులు ఇవ్వకుండా అప్రాధాన్యత లేని పోస్టింగుల్లో నియమిస్తున్నారని విమర్శించారు. ప్రాధాన్యత గల స్థానాలలో అగ్ర కులస్తులకే కట్టబెట్టారని ఆరోపించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ ఐఏఎస్, ఐపీఎస్‌లకు ప్రాధాన్యత గల పోస్టుల్లో నియమించాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా సంకష్టహర చతుర్థి పూజలు

కరీంనగర్ రూరల్, మార్చి27: కరీంనగర్ రూరల్ మండలం నగు నూరులోని శ్రీ దుర్గాభవాని దేవాలయంలోని లక్ష్మీగణపతికి సంకష్టహర చతుర్థి పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మాధికారి పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో విశేష అభిషేకం, ఫలపంచామృతాభిషేకం, విశేష హారతి, పూజాకార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు పవన్‌కృష్ణశర్మ నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.

31న పుస్తకావిష్కరణ

కరీంనగర్ కల్చరల్, మార్చి 8: అంగన్‌వాడీ హుజూరాబాద్ ప్రాజెక్టు సూపర్‌వైజర్, కవయిత్రి కోరుకంటి శశికిరణ్మయి కవిత్వం నీ రాక కోసం పుస్తకావిష్కరణ నగరంలోని వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు ప్రముఖ గాయకుడు, ఉపాధ్యాయుడు కాసు మహేందర్‌రాజు తెలిపారు. ఈనెల 31న కరీంనగర్ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ జివి శ్యామ్‌ప్రసాద్‌లాల్ హాజరవుతారని తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈకార్యక్రమానికి విశిష్ట అతిథిగా కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య అవార్డు గ్రహీత డాక్టర్ దాసరి వెంకటరమణ, ప్రత్యేక అతిథిగా జిల్లా మహిళా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి తదితరులు హాజరవుతారని తెలిపారు.

శిశు గృహ చిన్నారి దత్తత

కరీంనగర్ టౌన్, మార్చి28: మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కరీంనగర్ శిశు గృహంలోని పాపను కలెక్టర్ పమేలాసత్పతి చేతుల మీదుగా సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథార్టీ, అడాప్షన్ రెగ్యులేషన్స్-22 ప్రకారం హైదరాబాద్‌కు చెందిన దంపతులకు గురువారం దత్తత ఇచ్చారు. ఈ సందర్భంగా దత్తత తీసుకున్న దంపతులతో కలెక్టర్ మాట్లాడుతూ పిల్లల బాగోగులను అడిగి తెలుసు కున్నారు. పిల్లలకు భవిష్యత్‌లో మంచి విద్య, పౌష్టికాహారం, అందించాలని సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి ఎం.సరస్వతి, పివో తిరుపతి, శిశు గృహ మేనేజర్ తేజస్వి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి మృతిపై విచారణ జరిపించాలి

భగత్‌నగర్, మార్చి 27: ఒక కళాశాలలో చదువుతున్న అభిలాష్ అనే విద్యార్థి అనుమానాస్పద మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పిడిఎస్‌యు, ఎంఎస్ఎఫ్ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతికి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అదృశ్యమైన విద్యార్థి మృతదేహం 24 రోజుల తర్వాత లభ్యమవడం బాధాకరమైన విషయమన్నారు. వెంటనే సంబంధిత కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్, కార్యదర్శి మచ్చ రమేష్, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు రత్నం రమేష్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నవీన్‌కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

సైదాపూర్, మార్చి 28: మండలంలోని వెన్కేపల్లి గ్రామానికి చెందిన మేకల మహేందర్ ఇటీవల మృతి చెందగా అతడితో చదువుకున్న తోటి విద్యార్థులు అతని కుటుంబానికి రూ.65వేల ఆర్థిక సాయం చేశారు. మహేందర్‌కు భార్య మౌనిక, కూతురు మధుచందన, కుమారుడు ఉన్నారు. 2005-06 సంవత్సరం పదవతరగతి విద్యార్థులు తమతో చదువుకున్న తోటి విద్యార్థి మహేందర్ చనిపోవడంతో క్లాస్‌మెంట్స్ అందరు రూ.65వేలు వసూల్‌చేసీ అతడి కూతురు మధుచందన పేరుపై పోస్టాఫీసులో ఫిక్సిడ్ డిపాజిట్ చేసీ పాస్ బుక్‌ను పాపకు అందజేశారు. స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచిన పూర్వ విద్యార్థులను పలువురు అభినందించారు.

విద్యార్థులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ


మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

హుజూరాబాద్, మార్చి 28: హుజూరాబాద్ పట్టణంలో పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు గురువారం ఐఏయూవైఎస్ఏ ఇంటర్నేషనల్ యునైటెడ్ యంగ్ స్టార్ అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ సంస్థ ప్రతినిధి మాట్ల జవహర్ చటర్ జీ మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. యువతలో సేవా భవాన్ని బాధ్యతను తెలియజేసి మంచి పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో అజయ్, పవన్, అఖిల్, రవళి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

● సంక్షిప్త సమాచారం..

● రామడుగు: మండలంలోని దేశరాజ్‌పల్లిలో గురువారం చొప్పదండి, మానకొండూర్ ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణలు కుషాల్ రెడీమిక్స్ కార్మాగారాన్ని ప్రారంభించారు. యువతకు ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వీర్ల వెంకటేశ్వర్‌రావు, కోల రమేశ్, మంచ మహేందర్‌రెడ్డి, నిర్వాహకుడు అజయ్ గ్రామస్థులు పాల్గొన్నారు.

● ఇల్లందకుంట: ఇల్లందకుంట మండలంలోని బోగంపాడు గ్రామానికి చెందిన జిల్లెల సంజీవరెడ్డి హైకోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. సంజీవరెడ్డి నియామకంపై జమ్మికుంట మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్న-కోటి, ఇల్లందకుంట మండల ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. సంజీవరెడ్డి మాట్లాడుతూ యువతకు సభ్యుల సమస్యల పరిష్కారానికి పాటుపడుతామని, అందరూ సహకరించాలని కోరారు.

● జమ్మికుంట: జమ్మికుంటలోని పలు వివాహ వేడుకలకు బీఆర్ఎస్ కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిలు గురువారం హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్ రావు, పిఏసిఎస్ చైర్మన్ పొనగంటి సంపత్ పాల్గొన్నారు.